

ఇటు కోతలు.. అటు దాడులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిం ది. ధరల్లేక అల్లాడిపోవాల్సి వస్తోంది. - 8లో



మామిడికి మద్దతు ధర

మామిడికి మద్దతు ధర కల్పిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ రైతులకు భరోసా కల్పించారు. - 8లో



ఒంటరి మహిళపై దాడి

ఒంటరి మహిళపై అకారణంగా భూయజ మాని దాడి చేసిన ఘటన శ్రీరంగరాజపురం మండలంలో చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

కాణిపాకం కిటకిట



క్యూలో నిరీక్షిస్తున్న భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి రాత్రి వరకు ఆలయంలో రద్దీ చోటుచేసుకుంది. క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. రాత్రి వరకు కూడా రద్దీ తగ్గలేదు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

నేడు ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 1998, 2008 డీఎస్సీ (ఎంటీఎస్, మినిమం టైం స్కేల్) టీచర్లకు ఆదివారం బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందని డీఈవో వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎంటీఎస్ టీచర్లకు మాన్యువల్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల సీనియారిటీ జాబితా సంబంధిత మండలాలకు పంపినట్లు చెప్పారు. ఆ జాబితా ప్రకారం ఆదివారం చిత్తూరులోని డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే కౌన్సెలింగ్ కు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. 2008 ఎంటీఎస్ టీచర్లకు ఉదయం 10 గంటలకు, 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

నేడు గురుకులాల్లో సీట్ల కేటాయింపు

తిరుపతి అర్బన్ : తిరుపతి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆదివారం సీట్లు కేటాయించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి బాలికలకు చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు సమీపంలోని సంజయ్ గాంధీ కాలనీలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. అలాగే బాలురకు చిత్తూరులోని వేము ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని పూతలపట్టు బాలుర గురుకుల పాఠశాలలో సీట్ల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి హాజరు కావాలని ఆమె కోరారు.

గిన్నిస్ రికార్డు కోసం గిరిజన పిల్లలకు కష్టాలా?

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం గిన్నిస్ రికార్డు, ప్రధాని మోదీ మెప్పు కోసం గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిన్నిస్ రికార్డు కోసం అనేక మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన హాస్టల్స్ నుంచి యోగాంధ్ర కార్యక్రమానికి అర్ధరాత్రి 2 గంటలకు బస్సులో తరలించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి విద్యార్థులు నిద్రించడానికి సరైన సదుపాయాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఇదే రీతిలో ప్రజాప్రతినిధుల పిల్లలను తరలిస్తారా..? అని ప్రశ్నించారు. వసతి గృహాల్లో ఉండే పిల్లలకు పౌష్టికాహారం పెట్టడానికి, జబ్బు చేస్తే మెరుగైన వైద్యం అందించడం చేతకాదని, యోగాంధ్ర కార్యక్రమానికి మాత్రం ప్రత్యేకమైన బస్సులు ఏర్పాటు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి చర్యలకు పాల్పడితే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రతి రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో యోగాంధ్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లాలోని పులిగుండు, బోయకొండ, కంగుంది, కాణిపాకం, బోయకొండలో యోగా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆయన గుర్తుచేశారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ నిత్యం యోగా సాధన చేయడం వల్ల అనారోగ్యం నుంచి బయటపడొచ్చన్నారు. అనంతరం యోగా ట్రైనర్స్ ఉన్న విశాల్, రెడ్డిమస్తాన్, రాధిక, సునీత, ప్రేమ్‌సాయి, శ్రీనివాస్, బాబుకు మెమెంటో, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా చైర్మన్ హేమలత, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా అటవీశాఖ అధికారి భరణి, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, టూరిజం అధికారి గౌరీ, అర్బన్ తహసీల్దార్ కులశేఖర్ పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు

– చిత్తూరు కలెక్టరేట్

'నేను మారాను.. మిమ్మల్ని మారుస్తాను. నన్ను నమ్మండి. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తాం. ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. ఫీజురీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత విద్యకు బాటలు వేస్తాం. ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తాం. పేద విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తాం' అంటూ గత ఎన్నికల్లో కూటమి నేతలు ఇబ్బడిముబ్బడిగా హామీలు గుప్పించారు. బాబు షూ్యరిటీ..భవిష్యత్తు గ్యారంటీ అంటూ యువతరాన్ని బుట్టలో వేసుకున్నారు. తీరా గద్దెనెక్కిన తర్వాత తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. ఇచ్చిన హామీలన్నీ అటకెక్కించేసి నిరుద్యోగులను రోడ్డున పడేశారు. ఫీజురీయింబర్స్ బకాయిలు విడుదల చేయకుండా పేద విద్యార్థులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సిద్ధమైంది. సోమవారం కలెక్టరేట్ ఎదుట యువతపోరుకు సన్నద్ధమవుతోంది. యువతపోరుపై 'సాక్షి' గ్రౌండ్‌రిపోర్ట్..

యువతకు వెన్నుపోటు



SAKSHI గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT

పేరుకుపోయిన ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు

- అప్పు చేసి చదువుకుంటున్న పేద విద్యార్థులు
- బకాయిలు విడుదల చేయకుండా మొండికేస్తున్న కూటమి నేతలు
- ఏడాదిగా భృతి కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు
- రేపు కలెక్టరేట్ ఎదుట యువత పోరుకు వైఎస్సార్‌సీపీ సన్నద్ధం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ కళాశాలల్లో 2,30,456 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటికే డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తిచేసి డీఎస్సీ, గ్రూప్ పరీక్షలు, పోలీస్ రిక్రూట్‌మెంట్, ఏపీపీఎస్సీ తదితర ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తున్న వారు 90 వేల మందికి పైగా ఉన్నారు. ఉన్నత చదువులు చదివి అరకొర జీతంపై ఆధారపడి స్థానికంగా, ఇతర రాష్ట్రాలకు వెళ్లి వ్యాపార, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంది. వీరిలో ఎంతోమంది తమ చదువుకు తగ్గ ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారు.

హామీలిచ్చి..తుంగలో తొక్కి

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలతో పాటు 147 హామీలు ఇచ్చి గద్దెనెక్కింది. ఏడాదిగా ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అటకెక్కించింది. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్, ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి అందజేస్తామని ప్రకటించి చేతులు పైకెత్తేసింది. ఏటా 20 లక్షల ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా.. ఎన్నో హామీలను తుంగలో తొక్కేసింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4,85,458 మంది నిరుద్యోగులు భృతికోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది.

2014లో ఇదే తరహా మోసం

2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 600కు పైగా హామీలిచ్చి గద్దెనెక్కారు. ఆపై ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. జాబు రావాలంటే..బాబు రావాలి.. అంటూ ఊదరగొట్టారు. ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని కపట ప్రేమ కురిపించారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు యువనేస్తం పేరుతో ముందుకొచ్చి సవాలక్ష ఆంక్షలు విధించారు. భృతిని రూ.వెయ్యికి కుదించేశారు. అప్పట్లో చిత్తూరు జిల్లాలో లక్షకు పైగా నిరుద్యోగులు ఉండగా ప్రభుత్వం విధించిన నిబంధనలతో పథకానికి 12 వేల మంది మాత్రమే అర్హత సాధించారు.

ఊసేలేని ఫీజు రీయింబర్స్‌మెంట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదు. విద్యాదీవెన, వసతిదీవెన నిధుల కోసం విద్యార్థులు ఏడాదిగా ఎదురుచూడాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో త్రైమాసికం ముగిసిన వెంటనే పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు.

వలసలే గతి

జాబ్ క్యాలెండర్ లేక, నిరుద్యోగ భృతి అందక ఉన్నత చదువులు చదివిన యువతీయువకులు వలసబాట పడుతున్నారు. బీటెక్, ఎంటెక్, పీజీ, తదితర చదువులు చదివిన యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు లేక ప్రైవేట్ రంగాలవైపు మొగ్గు చూపుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చైన్నె తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వందలాది మంది నిరుద్యోగులు స్థానికంగానే చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉద్యోగ అవకాశాలకు వయస్సు దాటి పోతుండడంతో వివిధ ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం చాలా మంది వేచి చూస్తున్నారు.



రేపు కలెక్టరేట్ వద్ద యువత పోరు

పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, నిరుద్యోగ భృతి, జాబ్‌క్యాలెండర్ డిమాండ్లను పరిష్కరించాలంటూ నిరుద్యోగుల పక్షాన యువత పోరుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు అమూల్ డెయిరీ వద్ద విద్యార్థులు, యువతతో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టనున్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి యువత, ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

జిల్లా సమాచారం

డిగ్రీ కళాశాలలు	116
ఇంజనీరింగ్ కళాశాలలు	14
ఐటీఐ కళాశాలలు	18
నర్సింగ్ కళాశాలలు	07
పాలిటెక్నిక్ కళాశాలలు	08
మెడికల్	02
బీఈడీ	07
ఎంబీఏ. ఎంసీఏ	11
మొత్తం కళాశాలలు	183

ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు

నియోజకవర్గం	విద్యార్థులు	పెండింగ్ మొత్తం (రూ.కోట్లల్లో)
చిత్తూరు	2,517	4,82,02,359
నగరి	3,444	6,20,96,235
పుంగనూరు	4,694	8,76,63,867
పూతలపట్టు	3,006	6,28,15,905
పలమనేరు	4,252	6,99,16,920
కుప్పం	3,049	5,04,42,063
గంగాధరనెల్లూరు	3,187	6,64,84,512
మొత్తం	24,149	44,76,21,861

భృతి ఇవ్వాల్సిందే



నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు అమూల్ డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నాం. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి యువత, విద్యార్థులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలి.

– మనోజ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు

భృతి ఇచ్చి ఉంటే కోచింగ్ తీసుకునేవాడ్ని



నేను పీజీ చేశాను. అలాగే బీఈడీ కూడా చేశాను. ఉద్యోగం రాలేదు. ఇటీవల డీఎస్సీ రాశాను. చంద్రబాబునాయుడు నిరుద్యోగ భృతి ఇచ్చి ఉంటే డీఎస్సీ కోచింగ్‌కు వెళ్లేవాడ్ని. కనీసం పోటీ పరీక్షలకు పుస్తకాలైనా కొనుక్కునేవాడ్ని. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు.

– గజేంద్ర, నిరుద్యోగి, శ్రీరంగరాజపురం మండలం

భృతి ఎగ్గొట్టారు



ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగులందరికీ మాయమాటలు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది పూర్తయినా ఇంతవరకు నిరుద్యోగభృతి ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచేసింది. మోసం చేయడం సబబుకాదు.

– మున్నా, చిత్తూరు

మోసం చేశారు



2014–2019 సంవత్సరాల్లో రూ.2వేలు నిరుద్యోగభృతి ఇస్తామని హామీనిచ్చారు. తూతూమంత్రంగా ఆ భృతిని కొందరికే ఇచ్చి మోసం చేశారు. ఈ సారి కూడా అలాగే మోసం చేస్తున్నారు. నిరుద్యోగులు కూటమి ప్రభుత్వం ఉచ్చులో పడి అల్లాడుతున్నారు. ఉద్యోగాలు ఏమైన ఇస్తార అంటే అది కూడ లేదు.

– సంజయ్, చిత్తూరు

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసే లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యింది. ఎంతో మంది పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. చదువుల కోసం తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు. వడ్డీ వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు మంజూరు చేయాలి.

– మన్సూర్, పుంగనూరు

ఇస్తారో.. ఇవ్వరో



కూటమి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తారో ఇవ్వరో కూడా తెలియడం లేదు. గత ప్రభుత్వంలో ప్రతి త్రైమాసికం ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు తల్లుల ఖాతాల్లో జమ చేసేవారు. ఇప్పుడు ఆ నిధుల గురించి ఎవరిని అడుగుతున్నా సమాధానం చెప్పడం లేదు. ఇలా చేస్తే ఎలా..?

– రుషి, పలమనేరు

మామిడి రైతులకు న్యాయం చేయండి

- గిట్టుబాటు ధరపై కలెక్టరేట్ వద్ద ధర్నా
- రైతులతో కలెక్టర్ చర్చలు
- ప్రభుత్వ సబ్సిడీ పెంపునకు ప్రతిపాదనలు



కలెక్టర్‌తో చర్చిస్తున్న రైతు సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మామిడి నేలరాలుతోందని, న్యాయం చేయాలని మామిడి రైతులు, రైతు సంఘాల నాయకులు తమ ఆవేదనను వెళ్లగక్కారు. శనివారం కలెక్టరేట్ వద్ద రైతు సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి న్యాయం చేయాలంటూ కూటమి ప్రభుత్వ అలసత్వ వైఖరిని ఎండగట్టారు. రైతు సంఘం నాయకులు జనార్దన్ మాట్లాడుతూ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు మామిడి కిలో రూ.12 పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలోని అనేక ఫ్యాక్టరీలు ఆ ఉత్తర్వులను అమలు చేయడం లేదన్నారు. చాలా ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాల్సింది పోయి రూ.5 ఇస్తున్నాయన్నారు. వారిని చూసి ర్యాంపుల నిర్వాహకులు రూ.3 ఇస్తున్నారని చెప్పారు. ఫ్యాక్టరీల వద్ద మామిడి రైతుల ట్రాక్టర్లు రోజుల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి ఉందన్నారు. ప్రభుత్వం అందజేసే రూ.4 సబ్సిడీని రూ.6గా అందజేయాలని డిమాండ్ చేశారు.

సబ్సిడీ రూ.5 ఇచ్చేలా ప్రతిపాదనలు

అనంతరం రైతు సంఘ నాయకులతో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ చర్చలు జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న పరిస్థితుల కారణంగా గుజ్జు పరిశ్రమల యజమానులు రూ.6 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ప్రస్తుతం అందజేస్తున్న సబ్సిడీ రూ.4కు బదులు రూ.5 ఇచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ర్యాంపుల ఆగడాలను అరికడతామని హామీ ఇచ్చారు. జిల్లాలో నిబంధనలు పాటించని నాలుగు ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. ర్యాంప్‌లను సైతం క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. రైతు సంఘ నాయకులు రామానాయుడు, ఉమాపతి, మునీశ్వర్‌రెడ్డి, ఆనంద్‌నాయుడు, మునిరత్నం, హేమలత, భారతి, రాజేందర్‌రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

చిత్తూరు అర్బన్: మున్సిపల్ ఇంజినీరింగ్, కార్మికులు జీతాలు పెంచాలని మున్సిపల్ ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామమూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు యం.శరవణ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్ రూ.29,200, సెమీ స్కిల్డ్ రూ.24,600 చెల్లించాలన్నారు. మినిమం టైం స్కేల్, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కు పెంచాలన్నారు. రిటైర్డ్ బెనిఫిట్స్ కింద కార్మికులకు గ్రాట్యూటీ రూ.10 లక్షలు మంజూరు చేస్తూ.. కార్మికునికి నెలకు పింఛను రూ.10000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శరవణ, ప్రధాన కార్యదర్శి డీ.శివకుమార్, కోశాధికారి శివప్రసాద్, గౌరవ సలహాదారు పీ.వెంకటేష్, ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణ, ఎస్.వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ టీ.గోపాలాచారి, ఏ.ఉషా యూనియన్ సభ్యులు కే.వీ.సునీల్‌కుమార్, డీఎపీ.శంకర్, ఎస్.పీరుల్లా, ఎం.వేలు, కే.సుజాత పాల్గొన్నారు.

ఇటు కోతలు.. అటు దాడులు!

జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చినా మద్దతు ధర లేక నష్టాల్లో కూరుకుపోతున్నారు. గుజ్జు పరిశ్రమల నిర్వాహకులు సకాలంలో అన్‌లోడ్ చేసుకోక ట్రాక్టర్ల ట్రక్కుల్లోనే కాయలు కుళ్లిపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. కొందరు కాయలను తోటల్లోనే వదిలేయడంతో అవి మాగి వాసన వెదజల్లుతున్నాయి. ఇదే అదునుగా ఏనుగుల మంద తోటలపై పడి ఉన్న కాయలను ఊడ్చేస్తుండడంతో మరిన్ని అవస్థలు పడాల్సి వస్తోంది.

త్రిశంకుస్వర్గంలో మామిడి రైతులు

- తోటల్లోనే మాగిపోతున్న తోతాపురి
- మామిడి వాసనతో తోటలపై దాడులకు దిగుతున్న గజరాజులు
- ధరల్లేక.. ఏనుగుల దాడులతో అల్లాడిపోతున్న అన్నదాతలు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



పెద్దపంజాణి మండలం, తిప్పిరెడ్డిపల్లి వద్ద ఏనుగులు ధ్వంసం చేయడంతో విరిగిపోయిన మామిడి కొమ్మలు



బంగారుపాళెం సమీపంలో మామిడిని చేలల్లో అన్‌లోడ్ చేస్తున్న రైతు

పలమనేరు: జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏడాది మామిడి నట్టేన ముంచేసింది. తోతాపురి రైతులను కష్టాల్లోకి నెట్టేసింది. వీటికి ధరల్లేక గుజ్జు పరిశ్రమల్లో టోకెన్లు చిక్కక, స్థానిక మండీల్లో అడిగేవారు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. అధికారులేమో తోటల్లోని కాయలను పలు దఫాలుగా కోయాలని ఆంక్షలు పెడుతున్నారు. మరోవైపు తోటల్లోనే కాయలు మాగి నేలరాలుతున్నాయి. మాగిన మామిడి వాసనతో కౌండిన్య అడవిలోంచి ఏనుగుల గుంపు మామిడి తోటలపై పడి కాయలను ఆరగిస్తున్నాయి.

నాలుగు నియోజకవర్గాల్లో మరీ ఘోరం...

జిల్లాలో 87వేల ఎకరాల్లో మామిడితోటలున్నాయి. ఏటా ఈ సీజన్‌లో 7 లక్షల టన్నుల దాకా దిగుబడి ఉంటుంది. ఇందులో 45 వేల ఎకరాల్లో తోతాపురి రకమే ఉంది. మూడున్నర లక్షల టన్నుల దాకా తోతాపురి దిగుబడి ఉంటుంది. కాగా ఏనుగుల సంచారం ఉన్న పలమనేరు, కుప్పం, పుంగనూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 40వేల ఎకరాల్లో మామిడి ఉండగా.. ఇందులో 22వేల ఎకరాలు తోతాపురి రకంగా ఉంది. వీటికి ధరల్లేక రైతులు తోటల్లోనే మామిడిని వదిలేశారు. ఇదే అదునుగా ఏనుగులు మామిడి తోటలనే టార్గెట్ చేస్తున్నాయి. పలమనేరు, బంగారుపాళెం, పెద్దపంజాణి, గంగవరం, సోమల, గుడిపాల తదితర మండలాలు కౌండిన్య అడవికి సమీపంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఇటీవల ఏనుగుల దాడులు పెచ్చుమీరుతున్నాయి. ఫలితంగా రెండు విధాలుగా మామిడి రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

లోకల్ ర్యాంపుల్లో మొదలుకాని వ్యాపారం

తోతాపురికి సంబంధించి ఆయా ప్రాంతాల్లోనే ఏటా వ్యాపారులు ర్యాంపులు పెట్టి సరుకును కొనేవారు. దీంతో ఫ్యాక్టరీలకు వెళ్లే సరుకు తగ్గేది. ఈ దఫా ధరలు లేనందున బయటి వ్యాపారులు చాలా చోట్ల ర్యాంపుల వద్ద మామిడి కాయల వ్యాపారాలు మొదలు పెట్టలేదు.

నేలరాలుతున్న మామిడి

సీజన్ ఆఖర్లోనైనా ధరలు పలుకుతాయేమోనని చాలామంది రైతులు తోటల్లోనే కాయలను వదిలేశారు. మాగిన కాయలు రాలి నేలపాలవుతున్నాయి. ఎంత ధర దక్కినా అమ్ముదామనుకొని కాయలు దింపిన రైతులు గుజ్జు ఫ్యాక్టరీల వద్దకెళితే టోకెన్లు దొరకడం లేదు. ఫ్యాక్టరీల వద్ద బండ్లు పెట్టుకొని వేచి చూడాల్సి వస్తోంది. దీంతో కొందరు రైతులు మార్కెట్‌కు తీసుకెళ్లిన మామిడి కాయలను చేలల్లో పారబోసి వచ్చేస్తున్నారు. మరికొందరు తోటల్లో కాయలు కోయకుండానే వదిలిపెట్టేస్తున్నారు. టమాటాలకంటే తోతాపురి మామిడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

ఏనుగులు తినేస్తున్నాయి



మాకు 2.5 ఎకరాల్లో మామిడితోట ఉంది. ఈ మధ్య రెండు సార్లు ఏనుగుల మంద తోటపై పడి కాయలను తిని, కొమ్మలను విరిచేశాయి. పోనీ కాయలు దించి అమ్ముదామంటే కిలో రూ.3 కూడా కొనేవారు లేరు. సంతవ్సరానికోపంట.. దీన్ని నమ్ముకుని బతికేటోళ్లం. అందుకే మామిడితోటే వద్దనుకుంటున్నాం. – నాగరత్నమ్మ, తిప్పిరెడ్డిపల్లి

భారీగా నష్టపోయాం



ఈ దఫా మామిడితోటలు కొని లక్షల్లో నష్టపోయాం. తోటకు కొట్టిన మందుల ఖర్చు, తోటమాలి డబ్బు కూడా మిగల్లేదు. పలమనేరులో ర్యాంపు లేదు. బంగారుపాళెంకు పోవాలంటే టన్నుకు ట్రాక్టర్ బాడుగ, కూలీలకే రూ.2,500 అవుతోంది. అక్కడ టన్నుకు దక్కేది రూ.3 వేలు. మాకు మిగిలేది రూ.500. – నయాజ్, మామిడితోటల కొనుగోలుదారు, పలమనేరు

పలు దఫాలుగా కోతలు కోయాలి



రైతులు తోటల్లోని కాయలను మాగినవి మాత్రమే పలు దఫాలుగా కోయాలి. అప్పుడు సీజన్ ఆఖర్ దాకా కోతలుంటాయి. ఒకేసారి కాయలన్నీ దించేసి వాటిని అమ్ముకోలేక ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఇంకా ర్యాంపులు ప్రారంభం కానిచోట్ల ర్యాంపులు ప్రారంభించే చర్యలు తీసుకుంటున్నాం. – మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి

మాజీ ఎమ్మెల్యే సతీమణికి పరామర్శ



నీరజను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సతీమణి నీరజ అనారోగ్యం కారణంగా చిత్తూరులోని బీవీరెడ్డి కాలనీలో బంధువుల నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆమెను శనివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సతీమణి స్వర్ణలత, కుమారుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పరామర్శించారు. యోగక్షేమాలు తెలుసుకొని ధైర్యంగా ఉండాలని చెప్పారు. తొలుత నగరంలోని దొడ్డిపల్లె సప్తకనికలమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు శ్రీధర్‌రెడ్డి, అను, అన్బు, మురళీరెడ్డి, చక్రి, ప్రసన్న, మనోజ్‌రెడ్డి, శేఖర్, అల్తాఫ్, స్టాండ్లీ పాల్గొన్నారు.

కళ్యాణ్‌పై పీడీ యాక్టు

పలమనేరు: పట్టణంలోని మొండోళ్ల కాలనీకి చెందిన ఎం.కళ్యాణ్(30)పై పీడీ యాక్టు నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించినట్టు పలమనేరు డీఎస్పీ డేరంగుల ప్రభాకర్ శనివారం మీడియాకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసుతోపాటు మరో పది నేరాలు కళ్యాణ్‌పై ఉన్నాయన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పీడీ చట్టాన్ని నమోదు చేశామన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు శనివారం హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ 2,300 డాలర్లు విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఈవో పెంచలకిషోర్‌కు ఆ నగదును అందజేయగా.. ఆయన దాత కుటుంబానికి ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

గుర్తుతెలియని వాహనం ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణ

రొంపిచర్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారి, రొంపిచర్ల మండలం, పెట్రోల్ బంక్ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. తూర్పు దళితవాడకు చెందిన వెంకటరమణ 42 బండికింద పల్లె పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం వచ్చి ఢీకొంది. వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు రొంపిచర్ల పోలీసులకు, 108కు సమాచారం ఇచ్చారు. గాయపడిన వెంకటరమణను చికిత్స నిమిత్తం అన్నమయ్య జిల్లా, పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీలో గుండెపోటుతో కుప్పకూలిన హెడ్ కానిస్టేబుల్



మురళీకృష్ణ (ఫైల్)

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో ఉంటూ గుండెపోటుతో మురళీకృష్ణ (61) అనే హెడ్ కానిస్టేబుల్ శనివారం మృతి చెందారు. చిత్తూరులోని గంగనపల్లికు చెందిన మురళీకృష్ణ ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఉన్న స్పెషల్ బ్రాంచ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాత్రికి 8.30 గంటల సమయంలో గుండె నొప్పి రావడంతో అక్కడే డ్యూటీలోనే ఇబ్బంది పడ్డారు. తోటి సిబ్బంది హుటాహుటిన ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. హెడ్‌కానిస్టేబుల్ మృతిపై ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

పకడ్బందీగా మామిడికి మద్దతు ధర

తవణంపల్లె: మామిడికి పకడ్బందీగా మద్దతు ధర కల్పిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ భరోసా కల్పించారు. శనివారం మండలంలోని పలు ఫ్యాక్టరీల క్రషింగ్‌ను ఆయన పర్యవేక్షించారు. ఎఫ్–3 ఫ్యాక్టరీ, సిద్ధార్థ జ్యూస్ ఫ్యాక్టరీతో పాటు జీసీఆర్, జీజీఆర్ ఫల్ప్ ఫ్యాక్టరీలు, గాజులపల్లె దగ్గర ఉన్న ర్యాంపులను తనిఖీ చేశారు. ఫ్యాక్టరీ యజమానులతో క్రషింగ్ ఎలా జరుగుతోందో అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని ట్రాక్టర్ల లోడ్లు అన్‌లోడ్లు చేయిస్తున్నారు.. రైతుల వివరాలు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ చేసిన రైతుల పూర్తి వివరాలు, బ్యాంకు ఖాతాల అకౌంట్ నంబర్లు తప్పులు లేకుండా చూసి పర్యవేక్షించాలని జడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడుని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సుధాకర్, ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి వందన పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై కేసు



ఎఫ్ఐఆర్ కాపీని అందుకుంటున్న మురగారెడ్డి

పుత్తూరు: గత ఏడాది మే 13న జరిగిన అసెంబ్లీ, లోకసభ ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న వివాదంపై కోర్టు ఆదేశాల మేరకు పుత్తూరు హెడ్ కానిస్టేబుల్‌పై శుక్రవారం రాత్రి పోలీసు కేసు నమోదైంది. సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు.. పుత్తూరు పట్టణానికి చెందిన కె.మురగారెడ్డి(59) ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుత్తూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ జి.మాధవ (హెచ్.సి.2727)పై పుత్తూరు జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేశారు. మురగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదులో గత ఏడాది మే 13వ తేదీన తాను ఓటు వేయడానికి తిమ్మాపురంలోని పోలింగ్ బూత్ నం.40 వద్దకు వెళ్లిన సమయంలో మొబైల్ పార్టీ ఇన్‌చార్జ్ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ మాధవ తనను అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరిస్తూ, దౌర్జన్యానికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులోని అంశాలు కేసు నమోదు చేయలేని (నాన్–కాగ్నిజబుల్) స్వభావం కలిగి ఉన్నందున స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టు అనుమతితో ఏఎస్ఐ పొన్నుస్వామి కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తును పుత్తూరు డీఎస్పీ ఆదేశాల మేరకు మరో స్టేషన్‌కు బదిలీ చేసే అవకాశం ఉంది.

గ్రానైట్ రాయి పడి..



గాయపడిన రంజన్‌వల్లి

గుడిపాల: గ్రానైట్ రాయి పడి కాళ్లు నుజ్జునుజ్జు అయిన ఘటన గుడిపాల మండలంలో చోటుచేసుకుంది. గుడిపాల క్రాస్ సమీపంలో ఉన్న రాధిక గ్రానైట్‌లో అస్సాం రాష్ట్రానికి చెందిన రంజన్‌వల్లి(32) పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం గ్రానైట్ రాయిని కోసేందుకు మిషన్‌పై ఎక్కించి తోస్తుండగా అదుపుతప్పి రాయి కాళ్లపై పడింది. దీంతో అతని కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. 108 సిబ్బంది శివ అతన్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

ఒంటరి మహిళపై దాడి

శ్రీరంగరాజపురం : ఒంటరి మహిళపై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన మండలంలోని పుల్లూరు క్రాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. బాధితురాలు నాగావేణి కథనం.. మండలంలోని పుల్లూరు క్రాస్ రోడ్డులో నాగవేణి నివాసం ఉంటున్నారు. శుక్రవారం పుల్లూరు క్రాస్ రోడ్డులో విద్యుత్ అధికారులు స్థానికంగా ఓ విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దిలీప్‌నాయుడు తన స్థలంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారని, అందుకు కారణం నాగవేణి అని ఆమెపై దురుసుగా ప్రవర్తించారు. ఆపై నడిరోడ్డులో కీచక పర్వానికి ఒడిగట్టాడు. ఆమె చీరలాగి, విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ విషయంపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో న్యాయం చేయలంటూ పోలీసు స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులతో కలసి నిరసన వ్యక్తం చేశారు.

కేసు నమోదు

మహిళపై దాడి చేసిన దిలీప్‌నాయుడుపై కేసు నమో దు చేసినట్లు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టు కుంటామని చెప్పారు. మహిళలపై ఎవరైనా దాడి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం దిగువమాసాపల్లి పంచాయతీలోని అప్పయ్యగారిపల్లిలో ఈనెల 5వ తేదీన ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు 16కేవీ టాన్స్‌ఫార్మర్లు దొంగలించారు. 20 కిలోల వైర్లను పట్టుకెళ్లారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఏఈ రాజా బీఎన్ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.